సిద్దిపేట
నమస్తే తెలంగాణ | మంగళవారం 17 సెప్టెంబర్ 2024
TUESDAY, SEPTEMBER 17, 2024

## కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్న వికాస్



తొగుట, సెప్టెంబర్ 16: మండలంలోని లింగంపేటకు చెందిన బీఆర్ఎస్ యువనేత పాశికంటి వికాస్ తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఎర్రవల్లిఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కలువగా ఆయన వికాస్‌ను దీవించారు.

## సుప్రీంకోర్టు తీర్పుతో బీసీ కులాలకు మేలు



చేర్యాలలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

చేర్యాల,సెప్టెంబర్ 16 : సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 42శాతం రిజర్వేషన్లు కేటాయించడం వల్ల వెనుబడిన బీసీ కులాలకు ఎంతో మేలు జరుగుతుందని బీసీ సంఘం నాయకులు శవల్ల రాజయ్య, బోయిని రాజు అన్నారు.పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ కులగణన బీసీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఎన్నో ఏండ్లుగా బీసీలు కోరుకున్నట్లు కులగణన జరగడం సంతోషంగా ఉందన్నారు.సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ బండారి కనకయ్య, నాయకులు అందె అశోక్, ఆరే సాయిలు, జంగిలి యాదగిరి, కర్రె నర్సింహులు, శెట్టె సిద్ధిరాములు, మ్యాక యాదయ్య, ఎగుర్ల ఎల్లయ్య, బండారి అంజయ్య పాల్గొన్నారు.

## నేడు అనంత చతుర్ధశి మహోత్సవం



ఎల్కంటిలో అనంత పద్మనాభస్వామి ఆలయం

రాయపోల్,సెప్టెంబరర్ 16: మండలంలోని ఎల్కల్‌లో శ్రీదేవి–భూదేవి సమేతంగా అనంత పద్మనాభస్వామికి అనంత చతుర్ధశి మహోత్సవాలు మంగళవారం నుంచి జరుగనున్నాయి. అనంత పద్మనాభ స్వామి వ్రతం,ఒత్తులు కాల్చడం. నవగ్రహ నారసింహ సుదర్శన హోమం, శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణంతోపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉత్సవాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకుడు అట్ల రామకృష్ణారెడ్డి తెలిపారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



మిరుదొడ్డిలో మల్లయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న టీచర్లు

మిరుదొడ్డి, సెప్టెంబర్ 16 : ఇటీవల మిరుదొడ్డి టౌన్‌లో వివిధ కారణాలతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సోమవారం మిరుదొడ్డి టౌన్‌కు చెందిన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మృతుల కుటుంబాలను పరామర్శించి బోయిని నాగరాజు కుటుంబానికి రూ.5 వేలు, మల్లయ్య కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. మిరుదొడ్డి టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యాయులు రామచంద్రం, మల్లేశం, రాజు, బాల్‌రాజు, నరేశ్, శివకుమార్, మహేశ్ పాల్గొన్నారు.

### పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న గోపాలస్వామి

మిరుదొడ్డి, సెప్టెంబర్ 16 : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి డిమాండ్ చేశారు. సోమవారం మిరుదొడ్డిలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు కాకుండా ఒకే సారి ప్రతి నెలా కార్మికులకు బిల్లులు చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసిన విధంగానే మధ్యాహ్న భోజన కార్మికులకు కోడి గుడ్లను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లు చెల్లించక పోవడంతో కార్మికుల కుటుంబాల పూట గడవడం కష్టంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి అంజయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, చంద్రయ్య, భాగ్యమ్మ, లక్ష్మి, లలిత, లావణ్య బాలవ్వ పాల్గొన్నారు.

## బైరాన్‌పల్లి సాయుధ పోరాట యోధుడు రామిని వెంకటయ్య

**నాటి రజాకార్లపై పోరాటాన్ని గుర్తు చేసుకున్న వైనం**



ఎల్బీనగర్, సెప్టెంబర్ 16: రజాకర్లపై పోరాటం చేసి ముగ్గురిని చంపి వారు పారిపోయేలా పోరాటం చేసింది బైరాన్‌పల్లి వాసులు. ఆనాటి పోరాటంలో పాల్గొన్న బైరాన్‌పల్లి వాసి సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు రామిని వెంకటయ్య తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా గత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ చైతన్యపురిలో తన కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి నివాసం ఉంటున్న ఆయన రజాకార్లతో పోరాడిన విషయాలను వెల్లడించారు. 21 ఏండ్ల వయస్సులో బైరాన్‌పల్లిలోని యువకులతో కలిసి హన్మంతు, వీరారెడ్డి నాయకత్వంలో మూడు బృందాలుగా ఏర్పడి ఊరు బురుజుపైన, ఊరి పొలిమేరల్లో కాపలా ఉండి రజాకార్ల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్నట్లు తెలిపారు. ముగ్గురు రజాకార్లు చనిపోగా మిలిగిన వారు గ్రామాన్ని విడిచి పారిపోయారన్నారు. ఈ సందర్భంగా రజాకార్ల ఆకృత్యాలను వివరించారు.

## నేడు జాతీయ పతాకావిష్కరణ

హుస్నాబాద్‌టౌన్, సెప్టెంబర్ 16: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ చేయనున్నట్లు కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పాలకవర్గసభ్యులు, అధికారులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

### సిద్దిపేటలో పొన్నం ప్రభాకర్

సిద్దిపేట,సెప్టెంబర్16: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

# గంగమ్మ ఒడికి గణనాథులు

**•చెరువులు, కుంటల వద్ద నిమజ్జనాల శోభ • సంప్రదాయ నృత్యాలతో సందడి**

నవరాత్రులు విశేష పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య తల్లి గంగమ్మ ఒడికి చేరుతున్నాడు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు, యువత శోభాయత్రల్లో పాల్గొన్నారు. సంప్రదాయ నృత్యాలు, కోలాటం, దాండియా, తీన్మార్ నృత్యాలు చేస్తూ స్వామి వారిని పురవీధులో ఊరేగించారు. అనంతరం చెరువులు, కుంటల్లో గణనాథులను నిమజ్జనం చేశారు.

–సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, సెప్టెంబర్16



గజ్వేల్‌లో గణేశ్ శోభాయాత్ర




మద్దూరు(ధూళిమిట్ట): శ్రీశైలంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న లద్నూర్ గ్రామస్తులు



హుస్నాబాద్: ఎల్లమ్మ చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజితావెంకట్



హుస్నాబాద్‌టౌన్: ఆరోగ్యగణపతిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న ఎంఎండీ సభ్యులు



బెజ్జంకి: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



సిద్దిపేట టౌన్: గణపయ్యను పల్లకిలో నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు



కోహెడ: గణనాథుడిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న పద్మశాలీ కులస్తులు

## 'మల్లన్న' క్షేత్రంలో ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



మల్లన్న క్షేత్రంలో వినాయకుడిని ఊరేగిస్తున్న ఆలయ ఈవో తదితరులు



చేర్యాల కుడి చెరువును పరిశీలిస్తున్న సీఐ తదితరులు

చేర్యాల, సెప్టెంబర్ 16 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ ఈవో ఏ.బాలాజీ తెలిపారు.తొమ్మిది రోజుల పాటు వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం స్వామి వారి క్షేత్రంలో ఊరేగింపు నిర్వహించి కోనేరులో నిమజ్జనం చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ ఏఈవో,సూపరింటెండెంట్లు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**కుడి చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన**

వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో పట్టణంలో విగ్రహాలను నిమజ్జనం చేసే కుడి చెరువును సోమవారం సీఐ శ్రీను, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి, కమిషనర్ నాగేందర్ పరిశీలించారు.ఈ సందర్భంగా వినాయకుని విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశంలో లైటింగ్ ఏర్పాటు, పార్కింగ్ స్థలం, బారికేడ్లు తదితర వాటిని అధికారులు పరిశీలించడంతో పాటు మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేసి సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులకు ఇప్పటికే నిమజ్జనం రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశామని, నిబంధనలు పాటిస్తూ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎస్సై వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వొడితెల రాజేశ్వర్‌రావు సేవలు చిరస్మరణీయం



అక్కన్నపేట: రాజేశ్వర్‌రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అక్కన్నపేట, సెప్టెంబర్ 16: మాజీ ఎంపీ వొడితెల రాజేశ్వర్‌రావు సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జడ్పీటీసీ మాలోతు బీలూనాయక్ కొనియాడారు. సోమవారం మండలంలోని అంతకపేటలోని రాజేశ్వర్‌రావు 93వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పెద్దనాన్న రాజేశ్వర్‌రావు ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు విశిష్ట సేవలందించారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇర్రి లావణ్యారాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రంగారావు, యాస శ్రీనివాస్, చల్లగొండ కిషన్‌రావు, తాళ్లపల్లి మల్లేశం, సురేందర్, రాజు పాల్గొన్నారు.

## పనులు చేసినా బిల్లులు చెల్లించలేదు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, సెప్టెంబర్ 16 : పల్లెల అభివృద్ధే పట్టణాల అభివృద్ధి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పడమే కానీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదని మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి మండి పడ్డారు. సోమవారం మిరుదొడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గెలిచిన పాపానికి గ్రామాల్లో అప్పో..సప్పో చేసి పల్లెల్లో అభివృద్ధి పనులు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా విడుదల చేయక అప్పుల్లో కూరుకు పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ పోలీసుల రాజులు, మాజీ సర్పంచ్‌లు బాల్ నర్సయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మండల సీనియర్ నాయకుడు సూకురి లింగం పాల్గొన్నారు.

### సీఎం అనుచిత వ్యాఖ్యలు తగవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, సెప్టెంబర్16: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రెడ్డి యాదగిరి అన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ పీఎస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అసభ్య పదజాలంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులపై అసభ్య పదజాలంతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం ఆయన స్థాయికి తగదన్నారు. మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై మాట్లాడిన తీరును ఖండించారు.చిల్లర మాటలు మాట్లాడితే బీఆర్ఎస్ కార్యకర్తలు అదేభాషను ఉపయోగిస్తారన్నారు. నాయకులు బండి శ్రీకాంత్, రాజమౌళి, పిట్ల రాకేశ్,వంశీ, ఆశోక్, రమేశ్, వెంకటేశ్, భరత్ పాల్గొన్నారు.

### నిమజ్జన వేడుకల పరిశీలన



నందారంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై విజయభాస్కర్

అక్కన్నపేట, సెప్టెంబర్ 16: మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగాయి. తహసీల్దార్ అనంత రెడ్డి, ఎస్సై విజయభాస్కర్ మండలంలోని ఆయా గ్రామాల్లోని నిమజ్జన వేడుకలను పరిశీలించారు. వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. ప్రశాంత వాతవరణంలో నిమజ్జనం చేయాలని సూచించారు.

## అపూర్వ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఏడో తరగతి పూర్వ విద్యార్థులు

కొమురవెల్లి, సెప్టెంబర్ 16 : మండలంలోని పోసానిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో (2003–04 బ్యాచ్) ఏడో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గౌటె రవి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. సుమారు 20 ఏండ్ల తర్వాత చదువుకున్న పాఠశాలలో కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తమ వంతు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య, పాఠశాల శాశ్వత దాత సోమ రమేశ్ గుప్తా, అమ్మ కమిటీ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## బైరాన్‌పల్లి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



బైరాన్‌పల్లి బురుజు వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట), సెప్టెంబర్16: అమరులైన బైరాన్‌పల్లివీరుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. ఈ నెల 10నుంచి 17వరకు నిర్వహించే అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా చేర్యాల నుంచి ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలోని బురుజు వద్దకు సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు, హమాలీ కార్మికులతో కలిసి బైక్‌ర్యాలీగా చేరుకొని బురుజు వద్ద అమరవీరులకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆముదాల మల్లారెడ్డి మాట్లాడారు. కమ్యూనిస్టులే అమరవీరులకు నిజమైన వారసులన్నారు. నాయకులు శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, సందెబోయిన ఎల్లయ్య, కొంగరి వెంకట్‌మావో, బద్దిపడగ కృష్ణారెడ్డి, రవికుమార్,రవీందర్, దాసరి ప్రశాంత్, బత్తిని శారద, చొప్పరి శిరీష, రాళ్లబండి నాగరాజు, ఎండీ షఫీ, ప్రశాంత్, శోభ, బేజాడి మల్లారెడ్డి పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

గజ్వేల్, సెప్టెంబర్ 16: గుండెపోటుతో టీచర్ మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గజ్వేల్‌లోని మోడల్ పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న ద్యాప వెంకటస్వామి సోమవారం తెల్లవారుజామున అద్దె ఇంట్లో ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల్లో గజ్వేల్ నుంచి జగదేవ్‌పూర్ పాఠశాలకు బదిలీ కావడంతో రెండు రోజుల క్రితం రిపోర్టు చేసినట్లు తోటి ఉపాధ్యాయులు తెలిపారు. వెంకటస్వామి స్వగ్రామం జగదేవ్‌పూర్ మండలం అలిరాజ్‌పేటకు మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న తోటి టీచర్లు, స్నేహితులు స్వగ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మృతుడి భార్య మంజుల జగదేవ్‌పూర్ జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నది. ఆయనకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

### సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

మిరుదొడ్డి, సెప్టెంబర్ 16 : ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన సీపీఎస్, యూపీఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ అక్బర్‌పేట–భూంపల్లి మండల అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశంలో చేర్చాలన్నారు. విద్యకు పునాది లాంటి ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదన్నారు. బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలన్నారు.

### పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

చేర్యాల, సెప్టెంబర్ 16 : మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన శెట్టె కనకయ్య(40) ఈ నెల 13న ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చేర్యాల దవాఖానకు తరలించడంతో వైద్యుల సూచనల మేరకు సిద్దిపేట దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడు.మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబంలో నెలకొన్న ఆర్థిక సమస్యలు తదితర కారణాలతో కనకయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

### కేంద్ర మంత్రిని కలిసిన ఎస్టీటీయూ బృందం



గజ్వేల్, సెప్టెంబర్ 16: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని సోమవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఎస్టీటీయూ (సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలిశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఓటు హక్కు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఓటు హక్కు అంశం తమ దృష్టిలో ఉన్నదని, తప్పకుండా ఎస్టీటీయూలకు ఓటు హక్కు కల్పించేలా కృషి చేస్తానన్నారు. జిల్లా నాయకుడు శ్రీధర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, మొహినొద్దీన్ పాల్గొన్నారు.

### సంతోష్‌రెడ్డికి పరామర్శ



రాయపోల్, సెప్టెంబర్ 16 : ఇటీవల ఖమ్మం జిల్లా వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లినప్పుడు మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు సంతోష్‌రెడ్డి వెళ్లగా అక్కడ జరిగిన కాంగ్రెస్ నాయకుల ఘర్షణలో గాయపడ్డాడు. సోమవారం బీఆర్ఎస్ దుబ్బాక నియోజకవర్గ సమన్వయ కర్త రణంశ్రీనివాస్‌గౌడ్ గుమ్మడిదల మండలం కొత్తపల్లిలోని సంతోష్‌రెడ్డి నివాసంలో కలిసి పరామర్శించారు. గాయపడిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జనార్దన్ రెడ్డి,గొట్టాల నరేశ్ ఉన్నారు.

### సీపీఎంలో పలువురి చేరిక

చేర్యాల, సెప్టెంబర్ 16 : కాంగ్రెస్ విధానాలు నచ్చక మున్సిపాలిటీలోని 6వ వార్డుకు చెందిన బుట్టి చందుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సీపీఎంలో చేరారు.సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బుట్టి చందుతో పాటు పలువురికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రజా పోరాటాలు నిర్వహించే సీపీఎం పార్టీలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పట్టణ కార్యదర్శి నాగరాజు, మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో, నాయకులు బండకింది అరణ్‌కుమార్, నాయకులు పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, శోభ, భాస్కర్ పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు సాయికిరణ్ ఎంపిక

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 16 : కొండపాక మండలం సిరిసినగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థి సాయికిరణ్ అండర్ 18 షాట్‌పుట్ విభాగంలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, ఫిజికల్ డైరెక్టర్ ఉప్పలయ్య తెలిపారు. ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సాయికిరణ్ పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థి సాయికిరణ్‌ను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పరమేశ్వర్, సెక్రటరీ వెంకటస్వామి, ఎస్జీఎఫ్ సెక్రటరీ రామేశ్వర్‌రెడ్డి, టీజీపీటీ ప్రెసిడెంట్ అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అభినందించారు.